అది పూరికే సిగ్గుపడిపోనాది.''

ఆ సాయంత్రం వసుమతి పాప చేయి పుచ్చుకుని ఏరాడ కొండవైపు షికారు బయలుదేరింది. కొండమీద సూర్యుడు ఎర్రగా నిప్పుముద్దలా వున్నాడు. బారులు తీర్చి వున్న తాటిచెట్ల కిందకి నడుస్తున్నది వసుమతి.

ఎవరో ముసిలమ్మలాగా వుంది. తాటిచెట్ల కింద గిలకలు ఏరుకుంటున్నాది. వసుమతిని చూడగానే లేచి నిలబడి నమస్కరించింది.

''రంగడు సెప్పినాడమ్మా రమ్మని. రేపు వద్దామనుకుంటున్నా.''

''ఎవరీ మనిషి?'' ఆశ్చర్యంగా చూసింది వసుమతి.

''నేనమ్మా అప్పలనరిసిని. మీరు పోల్చుకోలేక పోనారమ్మా.''

ఎవరో వూహల శిఖరం మీదనుండి, వాస్తవమనే అగాథంలోకి విసిరివేసినట్టుగా వుంది వసుమతికి.

''అప్పలనరిసీ! ఏమిటిలా చిక్కిపోయావు? ఏమైనా జబ్బు చేసిందా?''

''ఏటవమ్మా పాడుబతుకూ, ఈ పిల్లలు సూడండమ్మా పూరికే పీక్కుతింటారు.''

అటువైపు కాస్త దూరంగా సింహాద్రి తాటిగిలకలూ, మట్టలూ కలిపి మోపు కట్టుకుని ఎత్తుకున్నాడు. వాడు ఎప్పటిలాగే మస్తుగా వూగుతూ, తూగుతూ నడిచిపోతున్నాడు.

''అమ్మా, పాత చీర వుంటే ఇయ్యండమ్మా. మూడునెలల గుంటడు. ఆడి పక్కకేటి నేదమ్మా.''

ఉలిక్కిపడి చూసింది వసుమతి.

'ఊర్వశి లాంటి అప్పలనరిసి అడుక్కోవటమా? ఓరి భగవంతుడా?'

హఠాత్తుగా-వసుమతికి అప్పలనరిసిని పట్టుకుని దూరంగా సముద్రంలోకి విసిరి పారేద్దామనిపించింది. అలాగయితే ఇంకెప్పుడూ అప్పలనరిసి తనకు కనిపించదు. అప్పలనరిసి తనవెంట పడుతుందేమో అని త్వరగా ముందుకు సాగిపోయింది.

**-బద్దిగం పాండురంగారెడ్డి (కరీంనగర్)**

# దుబారా

**ఆఫీసు నుంచి వచ్చి బాత్‌రూంలోకి వెళ్లి మొహం కడుక్కుని హాల్లోకి వచ్చిన భర్తకు ప్రేమగా పకోడీల ప్లేటును అందిస్తూ ''ఏమండీ! రేపు ఫస్ట్ తారీఖు కదా!'' అడిగింది భార్య.**

''ఔను! అయితే ఏం?''

''మరేం లేదు. పండుగ వస్తుంది కదా! నాకు ఓ రెండు వేలు ఇస్తే నేను పట్టుచీర కొనుక్కుంటానండి'' ఎంతో ఆనందంగా, గారంగా అడిగింది భార్య.

''కుదరదు'' వెంటనే చెప్పాడు భర్త.

ఎప్పుడు ఏమడిగినా తక్కున కాదనకుండా అంగీకారాన్ని తెలిపే భర్త ఇలా అనడంతో ''ఏం? ఎందుకు కుదరదు?'' ఆశ్చర్యంగా అడిగింది భార్య.

''ఇకనుంచి అలాంటివేం కుదరవు. ఇన్నాళ్లు ఏదీ తెలీనితనంతో గడచిపోయింది. ఇకనుండయినా జాగ్రత్త పడాలి'' చెప్పాడు భర్త.

''ఏంటండి! మీరేం చెబుతున్నారో నాకు అర్థం కావడం లేదు. అదేదో కాస్త అర్థమయ్యేలా చెప్పండి'' ఇంకా ఆశ్చర్యంగా అడిగింది భార్య.

''రాజీ! మన పిల్లలు పెద్దవారవుతున్నారు. వారి చదువులు, పెళ్లిళ్లు అంటే చాలా ఖర్చువుతుంది. కనుక ఇకనుంచి మనం దుబారాను, అనవసర ఖర్చులను తగ్గించుకొని, వచ్చే నా ఆదాయాన్ని చాలా జాగ్రత్తగా, పొదుపుగా వాడుకుంటూ అంతో ఇంతో మిగిలించాలి. దీనిని ఈ కొత్త సంవత్సరం నిర్ణయంగా తీసుకుందాం'' చెప్పాడు భర్త.

''అలాగేనండి. మీ ఆలోచన చాలా బాగుంది. అందుకు నేను పూర్తిగా సహకరిస్తాను. ఏం తగ్గించుకోవాలో, ఎలా మెలగాలో మీరే చెప్పండి'' సంతోషంగా అడిగింది భార్య.



''ఒకటి- నువ్వు ఇంట్లోనే వుంటావు కనుక పనిమనిషిని మానిపించాలి. రెండు- పక్కింటివాళ్లింట్లో పేపరు, పత్రికలు వుంటాయి కనుక వాటిని కొనడం మానేయాలి. మూడు- టీవీ వుంది కనుక సినిమాలకు వెళ్లడం బంద్ చేయాలి. నాలుగు- చీరలు, నగలు కొనకుండా షాపింగ్ మానేయాలి. ఐదు- అనారోగ్యాన్ని కలిగిస్తాయి కనుక చేపలు, మాంసాహారాన్ని మానేయాలి. ఆరు- వాయిదాల పద్ధతిలో వస్తువులను కొనడం మానేయాలి. ఏడు- పిల్లలని ట్యూషన్ మాన్పించి ఇంటి దగ్గర నువ్వే చెప్పాలి. ఎనిమిది- బంధువులు వచ్చినపుడు, పండుగలప్పుడు దుబారాను తగ్గించాలి. తొమ్మిది- నడక ఆరోగ్యానికి మంచిది కనుక షాపింగ్ పనులన్నీ ఆటో ఉపయోగించకుండా చూసుకోవాలి. పది- కరెంటు, ఫోన్‌లను పొదుపుగా వాడుకుంటూ ఖర్చులను తగ్గించాలి'' గడగడా చెప్పాడు భర్త.

''అలాగేనండీ! మీరు చెప్పినవన్నీ చాలా బాగున్నాయి. తూ.చా. తప్పకుండా పాటిస్తాను. కానీ మీరు కూడా...'' అంటూ చెప్పడానికి సందేహించింది భార్య.

''ఊ! మీరు కూడా ఏంటో చెప్పు. తప్పకుండా చేస్తాను'' నవ్వుతూ చెప్పాడు భర్త.

''ఏం లేదు. మీరు కూడా ఆర్థికంగా, ఆరోగ్య, శారీరక, మానసికపరంగా హానిని కలిగించే ఆ సిగరెట్లు, డ్రింక్ మానివేస్తే...'' అంటున్న భార్యను మధ్యలోనే అడ్డుకొని ''ఆహా! అది మాత్రం కుదరదు. ఆ ఒక్కటీ అడక్కు...'' అంటూ విసవిసా బయటికి వెళ్లిపోయిన మగమహారాజయిన భర్తను బాధగా చూస్తూ నిశ్చేష్టురాలయింది ఆ సగటు ఇల్లాలు.

**-ఎస్.కె.దుర్గ (క్యాతూరు)**